# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU



తెలంగాణ వెన్నెల వాక్కు విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :44 | 29-08- 2026 | శుక్రవారం | పేజీలు: 4 | వెల:03/-


# నేపాల్‌ను వణికిస్తున్న వరదలు

## 579 మంది మృతి.. 1,924 మంది గల్లంతు



కాఠ్మాండు: హిమాలయ ప్రాంతంలో సంభవించిన భారీ వరదలు, ఆకస్మిక వరదలతో నేపాల్ అతలాకుతలమైంది. వరదలు, కొండచరియలు, భారీగా ప్రవహించిన బురద, శిథిలాల కారణంగా భారీ ప్రాణనష్టం సంభవించింది. నేపాల్‌లో ఇప్పటివరకు 579 మంది మృతి చెందగా, 1,924 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు.

భారీ వరదల ధాటికి పలు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో అనేక ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవడం కష్టంగా మారింది. నేపాల్ సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది భారీగా రంగంలోకి దిగి గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటివరకు వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వరదల ప్రభావం నేపాల్--చైనా సరిహద్దు ప్రాంతాలపైనా పడింది. టిబెట్‌లో ఐదుగురు మృతి చెందగా, వందలాది మంది గల్లంతైనట్లు చైనా అధికారులు తెలిపారు. మరోవైపు నేపాల్‌లో చిక్కుకున్న భారతీయుల పరిస్థితిపై భారత ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. 320 మంది భారతీయులు ఇంకా ఆచూకీ లేకుండా ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. పలువురు భారతీయులను ఇప్పటికే సురక్షితంగా తరలించారు.

ఇదిలా ఉండగా, ప్రభావిత ప్రాంతాల్లో మరోసారి వరదలు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. హిమనదాలు కూలిపోవడం, నీటి మట్టాలు పెరగడం, కొండ ప్రాంతాల్లో అస్థిర పరిస్థితులు సహాయక చర్యలకు సవాల్‌గా మారాయి. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

వరదలు, కొండచరియల కారణంగా అనేక ప్రాంతాల్లో ఇంకా శిథిలాలు తొలగించాల్సి ఉంది. నదీ పరివాహక ప్రాంతాల్లో గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా పునరుద్ధరించకపోవడంతో మరికొందరి ఆచూకీ తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో మృతుల సంఖ్య, గల్లంతైన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని 2

# దేవదుర్గ బంగారం--రాగి బ్లాక్‌లలో ఖనిజ అన్వేషణ వేగవంతం చేయాలి



హట్టి గోల్డ్ మైన్స్ అనుభవాన్ని వినియోగించుకోవాలి ।
సైట్ కార్యాలయ ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని సింగరేణి సీఎండీకి ఆదేశాలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:
కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో ఉన్న బంగారం మరియు రాగి ఖనిజాల అన్వేషణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ దిశగా పనులను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి సంస్థ ఉన్నతాధికారులను ఖచ్చితంగా ఆదేశించారు. దేశంలోనే ప్రముఖ ప్రభుత్వ రంగ బొగ్గు గనుల సంస్థ అయిన సింగరేణి ఇటీవల వేలంలో దక్కించుకున్న దేవదుర్గ బంగారం--రాగి ఖనిజ 2

# తెలంగాణకు వర్ష లోటు

## 15 శాతం తక్కువ.. 16 జిల్లాల్లో లోటు వర్షపాతం



హైదరాబాద్, ఆగస్టు 29: నైరుతి రుతుపవనాల ప్రభావం తగ్గడంతో తెలంగాణలో వర్షపాతం లోటు మరింత స్పష్టమవుతోంది. జూన్ 1 నుంచి ఆగస్టు 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా 469.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ కాలంలో 551.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, ప్రస్తుతం 15 శాతం లోటు నమోదైనట్లు రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 జిల్లాలు లోటు వర్షపాతం కేటగిరీలో ఉండగా, మరో 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా మాత్రమే 20 శాతం అధిక వర్షపాతంతో అదనపు వర్షాల కేటగిరీలో ఉంది. మండలాల వారీగా చూస్తే 621 మండలాల్లో 290 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మరో 256 మండలాలు సాధారణ కేటగిరీలో ఉన్నప్పటికీ, వాటిలోనూ కొన్నింటిలో వాస్తవంగా వర్షపాతం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ఆగస్టు నెలలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం పరిస్థితిని మరింత ప్రభావితం చేసింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 215.8 మి.మీ. కాగా, ఇప్పటివరకు నమోదైన వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉన్నాయి. దీంతో పలుచోట్ల పగటి 2

# లాటరీలో ఇందిరమ్మ ఇల్లు!

## నియోజకవర్గానికి 480 చొప్పున కేటాయింపు



హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను రాజకీయేతరంగా, పూర్తి పారదర్శకమైన లాటరీ పద్ధతిలో ఇస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నాంపల్లి నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఈ వివరాలను వెల్లడిస్తూ ప్రసంగించారు. ఇళ్ల కేటాయింపు కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులను స్వీకరించామని, లబ్ధిదారులను ఎంపిక చేసే ఈ ప్రక్రియ అంతటా అత్యంత పారదర్శకత పాటిస్తున్నామని స్పష్టం చేశారు.

నాంపల్లి నియోజకవర్గంలో మొత్తం 480 ఫ్లాట్ల కేటాయింపు కోసం ప్రజల సమక్షంలోనే లాటరీ నిర్వహించి 600 మంది పేర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో మొదటి 480 మందిని నేరుగా ఇళ్ల కేటాయింపునకు పరిగణనలోకి తీసుకుంటారని, మిగిలిన 120 మందిని వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచుతారని వివరించారు. మొదటి జాబితాలోని లబ్ధిదారుల్లో ఎవరికైనా అర్హత లేదని తేలితే లేదా వారు నిరాకరిస్తే, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నవారికి వరుస క్రమంలో ఆ ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

రాజేంద్రనగర్‌లో ఊహించని అద్భుతం: 2

# భారత్‌కూ అదే ముప్పు

## ఆందోళనకరస్థాయిలో కరుగుతున్న హిమానీనదాలు

న్యూఢిల్లీ బ్యూరో
నేపాల్ దేశంలో సంభవించిన ఘోర జలప్రళయానికి హిమానీనదాలు అత్యంత వేగంగా కరిగిపోవడం మరియు హిమానీ సరస్సుల విస్ఫోటమే ప్రధాన కారణమని పర్యావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ తరహా ప్రమాదం కేవలం నేపాల్‌కే పరిమితం కాలేదని, హిమాలయ పర్వతశ్రేణులను అనుకుని ఉన్న మన భారతదేశంలోని పలు ఉత్తరాది మరియు ఈశాన్య రాష్ట్రాలకు కూడా ఇదే విధమైన విపత్తు ముప్పు పొంచి ఉందని శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళనతో హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, మరియు లద్దాఖ్ ప్రాంతాలలో కొన్ని సున్నితమైన భాగాలను ఆకస్మిక వరదలు ఇదే రీతిలో కమ్మేసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గతంలో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో 2013లో చోటుచేసుకున్న ఉపాధి వినాశనం, అలాగే 2021లో చమోలీ జిల్లాలో సంభవించిన ప్రళయాలు మన కళ్ల ముందే ఉన్న ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ, రుద్రప్రయాగ్, ఉత్తరకాశీ, పిథోడ్‌గఢ్ జిల్లాల్లోను, అలాగే హిమాచల్‌ప్రదేశ్‌లోని కిన్నౌర్, లాహౌల్-స్పితి, కులు లోయలలోను నేపాల్‌లో సంభవించిన తరహా జలప్రళయాలు ముంచెత్తే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉత్తర సిక్కింలో అత్యంత ఎత్తయిన ప్రాంతంలో ఉండే హిమానీనద సరస్సు అయిన 'దక్షిణ లోనాక్ సరస్సు' అత్యంత ప్రమాదకర స్థాయిలో నిండిపోయి ఉనికిలో ఉన్నట్లు సమాచారం అందుతోంది.



హిమానీ సరస్సులు ఎలా విస్ఫోటం చెందుతాయి?
గ్లోబల్ వార్మింగ్ లేదా భూతాపం కారణంగా పర్వతాలపై ఉన్న మంచు విపరీతంగా కరిగి నీటిగా మారుతుంది. ఆ నీరు కొండ దిగువన ఉండే పల్లపు ప్రాంతానికి చేరుకుని నిల్వ ఉండటంతో దానిని 'హిమానీ సరస్సు' (గ్లేసియల్ లేక్) అని 2

# కమీషన్ల కక్కుర్తితో దేశం దాటిన 587 కోట్లు!



హైదరాబాద్, ఆగస్టు
ఇటీవల చోటుచేసుకున్న ఒక డిజిటల్ అరెస్టు కేసును సవాలుగా తీసుకుని దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు, దేశవ్యాప్తంగా మూలాలు ఉన్న ఒక అతి పెద్ద వ్యవస్థీకృత సైబర్ నేరచర్య ముఠా మూలాలను ఛేదించారు. తెలంగాణ, తమిళనాడు సహా దేశంలోని ఏకంగా 20 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్న సైబర్ కేటుగాళ్ల నెట్‌వర్క్ దందాను ఈడీ అధికారులు 2

# రైతు బీమాకు బ్రేక్!

## ఆగస్టు 14తో ముగిసిన గడువు.. నవంబర్ వరకు కొత్త పథకం కోసం నిరీక్షణ

నిర్మల్, ఆగస్టు 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు ఆపద సమయంలో అండగా నిలిచిన రైతు బీమా పథకంపై అనిశ్చితి నెలకొంది. ప్రతి ఏడాది ఆగస్టు 14లోగా రెన్యూవల్ అయ్యే రైతు బీమా పాలసీని ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించకపోవడంతో నిర్మల్ జిల్లా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రైతు కుటుంబానికి అత్యవసర సమయంలో కొండంత అండగా నిలిచే రూ.5 లక్షల బీమా సాయం ప్రస్తుతం అందుబాటులో ఉందా లేదా అన్నదానిపై స్పష్టత లేకపోవడం అన్నదాతలను కలవరపెడుతోంది.

2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఐసీ భాగస్వామ్యంతో రైతు బీమా పథకాన్ని ప్రారంభించింది. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అర్హులైన రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. రైతు సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అర్హత కలిగిన రైతులకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ పాలసీలను ఏటా పునరుద్ధరిస్తూ వచ్చింది. రైతు మరణించిన సందర్భంలో నామినీకి రూ.5 లక్షల బీమా పరిహారం అందేది.

గతంలో ప్రతిఏటా నిర్ణీత గడువులోగా ప్రీమియం చెల్లించి పాలసీలను రెన్యూవల్ చేయడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఈ ఏడాది ఆగస్టు 14 నాటికి రెన్యూవల్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో రైతు బీమా కొనసాగింపుపై సందేహాలు నెలకొన్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రైతులు పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండే సమయంలో ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు, పురుగుమందుల ప్రభావం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో బీమా రక్షణ లేకపోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త పథకంతో గందరగోళం

రైతు బీమా స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. రైతులకు మాత్రమే పరిమితమైన రైతు బీమాకు భిన్నంగా, విస్తృతంగా నిరుపేద కుటుంబాలకు బీమా రక్షణ కల్పించే విధంగా కొత్త పథకాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అయితే రైతు బీమా గడువు ముగిసిన తర్వాత కొత్త పథకం అమల్లోకి వచ్చే వరకు ఉన్న కాలమే ఇప్పుడు ప్రధాన సమస్యగా మారింది. ఆగస్టు 14 నుంచి నవంబర్ 18 వరకు రైతులకు బీమా రక్షణపై స్పష్టత లేకపోవడంతో ఈ వ్యవధిలో ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగితే సంబంధిత రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుందా? లేదా? అనే ప్రశ్న తలెత్తుతోంది. కొత్త పథకం ప్రారంభమయ్యే వరకు మధ్యంతరంగా పాత రైతు బీమాను కొనసాగించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. పరిహారమే కుటుంబాలకు పెద్ద అండ గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లే పరిస్థితి ఉంటుంది. పిల్లల చదువులు, వ్యవసాయ రుణాలు, కుటుంబ అవసరాలు తదితర భారాలను మోయాల్సి వస్తుంది. ఇలాంటి



సందర్భాల్లో రైతు బీమా ద్వారా అందే రూ.5 లక్షల సాయం ఆయా కుటుంబాలకు కొంతవరకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అందుకే రైతులు ఈ పథకాన్ని తమ కుటుంబాలకు రక్షణ కవచంగా భావిస్తున్నారు.

నిర్మల్ జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాలు ఉన్నాయి. కుంటాల, బాసర, భైంసా, ఖానాపూర్, నిర్మల్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది రైతులు పంటల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వర్షాకాలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో రైతు బీమా విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

అధికారిక ఆదేశాల కోసం ఎదురు చూపులురైతు బీమా పునరుద్ధరణకు సంబంధించి క్షేత్రస్థాయిలోనూ స్పష్టత లేకపోవడం పరిస్థితిని మరింత అయోమయంగా మార్చింది. ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి పునరుద్ధరణకు సంబంధించి అధికారిక ఆదేశాలు లేదా మార్గదర్శకాలు అందలేదని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతంలో నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేదని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతుల డిమాండ్

కొత్త పథకం తీసుకురావడం స్వాగతించదగినదేనని, అయితే కొత్త పథకం అమల్లోకి వచ్చే వరకు రైతు కుటుంబాలకు రక్షణ లేకుండా చేయడం సరికాదని అన్నదాతలు అంటున్నారు. పాత రైతు బీమాను తాత్కాలికంగానైనా కొనసాగించి, కొత్త పథకం అమల్లోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయాలని కోరుతున్నారు.ఏళ్లుగా రైతు కుటుంబాలకు భరోసాగా ఉన్న పథకం విషయంలో ప్రభుత్వం వెంటనే అధికారిక ప్రకటన చేయాలని, ప్రీమియం చెల్లింపు, పాలసీ కొనసాగింపు, మధ్యంతర కాలంలో రైతు మరణిస్తే పరిహారం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొత్త పథకం వచ్చే వరకు రైతు కుటుంబాలకు బీమా రక్షణ ఉండేలా ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

# హిమాలయాల 'మంచు బాంబు'..

## బీహార్‌కు ముంచుకొస్తున్న వినాశనం!

### పర్వతాల హెచ్చరికను పట్టించుకుందామా?

ప్రకృతి విరుద్ధంగా మానవాళి ప్రవర్తించినప్పుడు చెల్లించాల్సిన మూల్యం ఎంత దారుణంగా, విధ్వంసకరంగా ఉంటుందో చెప్పడానికి హిమాలయ పర్వత శ్రేణుల్లో సంభవిస్తున్న ఆకస్మిక పరిణామాలు నిదర్శనంగా మారుతున్నాయి. హిమాలయాలు వేగంగా వేడెక్కుతున్నాయని, మానవాళి మనుగడకే తీవ్ర ముప్పు పొంచి ఉందని పర్యావరణ వేత్తలు, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు చాలా కాలంగా హెచ్చరిస్తున్నా పాలకులు మరియు ప్రభుత్వాలలో చలనం రావడం లేదు. తాజాగా చైనా–నేపాల్ సరిహద్దులోని త్రిశూలి నదీ పరివాహక ప్రాంతంలో నూతనంగా ఏర్పడిన గ్లేషియల్ సరస్సు బరస్ట్ అయ్యే ప్రమాదం ఉందని చైనా హెచ్చరించడం ప్రపంచదేశాలను తీవ్రంగా ఉలిక్కిపడేలా చేసింది. పర్వతాల పైభాగంలో మంచు సరస్సులు ఏ క్షణంలోనైనా పేలిపోవడం వల్ల నీరు, రాళ్లు, రప్పలు, మోడులు కొట్టుకొచ్చి వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం, వేలాది మంది గల్లంతు కావడం అనేది కేవలం రాబోయే పెద్ద విపత్తుకు ఆరంభం మాత్రమే. ఈ భయానక పర్యవసానాలకు ముగింపు పలకాలంటే అసలు విపత్తు మూలాలను, భూగోళం వేడెక్కుతున్న తీరును మరియు పర్వత ప్రాంత వ్యవస్థను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రపంచ సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలతో పోలిస్తే హిందూ కుష్ హిమాలయా ప్రాంతం అత్యంత వేగంగా వేడెక్కుతోందని శాస్త్రీయ అధ్యయనాలు నిరూపించాయి. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం వల్ల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగితే, హిమాలయ పర్వత ప్రాంతంలో అది అదనంగా మరో 0.3 డిగ్రీలు ఎక్కువగా నమోదు కానుంది. ఒకవేళ ఉద్గారాల తీవ్రత ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం చివరి నాటికి ఈ పర్వత ప్రాంత ఉష్ణోగ్రతలు 2.5 నుంచి 5.5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే ప్రమాదకర స్థితిలోకి మనం అడుగుపెడుతున్నాం. దీని పర్యవసానంగా గత కొన్ని దశాబ్దాల కాలంలో చల్లని రాత్రుల సంఖ్య తగ్గిపోయి, వేడి రోజులు, వేడి రాత్రుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని వాతావరణ ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. పర్వత శిఖరాలపై శతాబ్దాలుగా గడ్డకట్టుకుపోయి ఉన్న మంచు పొరలు కరిగిపోవడం వల్ల పర్వతాల భౌతిక స్థిరత్వం దెబ్బతిని, కొండచరియలు విరిగిపడటం, మంచు కొండలు కూలిపోవడం విపరీతంగా పెరిగిపోతోంది.హిమానీనదాలు కరిగిపోవడం వల్ల పర్వత లోయల్లో కొత్తగా వేలాది సరస్సులు రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి చూడటానికి ఎంత అందంగా ఉన్నప్పటికీ, నిజానికి ఇవి ఏ క్షణంలోనైనా పేలడానికి సిద్ధంగా ఉన్న మంచు బాంబుల లాంటివి. గతంలో నిర్వహించిన సర్వేలో కేవలం ఎనిమిది వేల ఆరువందలకు పైగా గ్లేషియల్ సరస్సులు మాత్రమే ఉండగా, ఇటీవలి ఆధునిక ఉపగ్రహ సర్వేల ద్వారా ఏకంగా ఇరవై ఐదు వేలకు పైగా సరస్సులు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిలో అనేక సరస్సులు ప్రమాదకరమైన నీటిమట్టంతో నిండిపోయి ఉన్నాయి. గతేడాది సిక్కింలోని 'దక్షిణ లోనాక్' గ్లేషియల్ సరస్సు పగిలిపోయి తీస్తా నదీ లోయను పూర్తిగా తుడిచిపెట్టేసిన తీరు, ఇటువంటి ప్రమాదాలు ఎంత వినాశకరంగా ఉంటాయో మన కళ్లకు కట్టినట్లు చూపించింది.

నేపాల్‌లో సంభవించే ఈ గ్లేషియల్ పరిణామాలు మరియు చైనా టిబెట్ పీఠభూమిలో చేపడుతున్న రకరకాల ప్రాజెక్టుల వల్ల అత్యంత ఘోరంగా దెబ్బతింటున్నది మన దేశంలోని బీహార్ రాష్ట్రమే. బీహార్ భౌగోళిక భూభాగంలో ఏకంగా డెబ్బై మూడు శాతం నదుల వరద పరివాహక ప్రాంతంలోనే ఉంది. భారతదేశంలో వరద ముంపునకు గురయ్యే మొత్తం జనాభాలో ఇరవై రెండు శాతానికి పైగా ప్రజలు ఒక్క బీహార్‌లోనే



నివసిస్తుండటం అత్యంత కలవరపరిచే విషయం. నేపాల్ పర్వతాల్లో ఉద్భవించే కోసి, గండ్క, బాగ్మతి, మహానంద వంటి ప్రతిష్టాత్మక నదులు మోసుకొచ్చే ఉగ్ర రూపానికి బీహార్ నిత్యం తీవ్రంగా బలవుతోంది. గతంలో వచ్చిన వరదల్లోనే వందలాది మంది చనిపోగా, కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. మరోవైపు నదులకు ఇరువైపులా సిమెంట్ గండికట్టలు నిర్మిస్తే వరదలు తగ్గుతాయనుకోవడం పాలకుల అతి పెద్ద అపోహ అని చరిత్ర రుజువు చేసింది. వేలాది కిలోమీటర్ల మేర గండికట్టలు నిర్మించిన తర్వాత కూడా ముంపు ప్రాంతం తగ్గకపోగా మరింత పెరిగింది. నదీ గర్భాల్లో పూడిక చేరడం వల్ల ఈ కట్టలు తెగిపోయి ఒకేసారి వినాశకరమైన వరదలు విరుచుకుపడుతున్నాయి.

పర్యావరణ అధ్యయనాల ప్రకారం ఇండో–గంగా మైదానంలో నైరుతి రుతుపవనాల సగటు వర్షపాతం తగ్గుతున్నప్పటికీ, తక్కువ సమయంలోనే ఆకస్మికంగా కురిసే అత్యంత భారీ వర్షాల సంఖ్య పెరిగింది. పర్వతాల్లో మంచు కరగడం వల్ల సృష్టింపబడుతున్న ప్రవాహాలు, ఈ ఉగ్ర వర్షాలు కలిసి పాతబడిన సాంప్రదాయ డ్రైనేజీ మరియు హైడ్రాలజీ మౌలిక వసతులను పూర్తిగా చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ అంతర్జాతీయ పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి కేవలం ఎత్తైన గండికట్టలు నిర్మించడం లేదా ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకోవడం ఏమాత్రం సరిపోదు. నీటి ప్రవాహాలు దేశాల సరిహద్దులను గౌరవించవు కాబట్టి చైనా, నేపాల్, భారతదేశం తమ రాజకీయ వైరుధ్యాలను పక్కనబెట్టి గ్లేషియల్ సరస్సుల నీటిమట్టాలపై ప్రత్యక్ష సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలి. అలాగే పర్వత శ్రేణులలో శాటిలైట్, ఆటోమేటెడ్ మానిటరింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసి, ప్రమాదాన్ని ముందే ఊహించి దిగువ ప్రాంత ప్రజలను ఖాళీ చేయించే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను విస్తృతంగా బలోపేతం చేయాలి. ప్రకృతి ఇస్తున్న ఈ అంతిమ హెచ్చరికలను ఇప్పటికీ మానవాళి నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో మనం చవిచూసే విపత్తులు మానవ ఊహకు కూడా అందనంత భయానకంగా ఉంటాయని రాజకీయ పాలకులు గ్రహించక తప్పదు.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# దేవదుర్గ బంగారం--రాగి బ్లాక్‌లలో ఖనిజ అన్వేషణ వేగవంతం చేయాలి

అన్వేషణ బ్లాక్, శతాబ్దాల చరిత్ర మరియు ప్రసిద్ధి కలిగిన హట్టి గోల్డ్ మైన్స్ కు అతి సమీపంలో ఉండటం తెలంగాణ రాష్ట్రానికి మరియు సింగరేణి సంస్థకు లభించిన ఒక గొప్ప అవకాశమని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొన్నారు. బంగారం తవ్వకాలలో, మైనింగ్ రంగానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంలో హట్టి సంస్థకు దశాబ్దాల సుదీర్ఘమైన అనుభవం మరియు నిపుణత ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ప్రసిద్ధ హట్టి సంస్థకు ఉన్న విస్తృత సాంకేతిక అనుభవాన్ని, పరిశోధనా పద్ధతులను దేవదుర్గ ప్రాజెక్టులో నూటికి నూరు శాతం సమర్థవంతంగా వినియోగించుకోవాలని సింగరేణి అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. దేవదుర్గ ఖనిజ బ్లాక్‌లో భూగర్భంలో దాగిన ఖనిజ నిక్షేపాల మొత్తం పరిమాణం ఎంత ఉంది? వాటి నాణ్యతా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయి? అనే విషయాలను వీలైనంత త్వరగా ఖచ్చితత్వంతో నిర్ధారించడానికి ఆధునిక సాంకేతిక పరికరాలు, శాస్త్రీయ అన్వేషణ పద్ధతులను మాత్రమే వినియోగించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

ప్రాథమిక విశ్లేషణలు మరియు అన్వేషణలో ఆశాజనకమైన, అనుకూలమైన ఫలితాలు వచ్చిన వెంటనే సమయం వృథా కాకుండా, తదుపరి దశలో చేపట్టాల్సిన మైనింగ్, ఖనిజ వెలికితీత పనులపై ఇప్పటి నుంచే సమగ్రమైన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. దేవదుర్గలో ప్రాజెక్టు పనులను స్థానికంగా నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా అత్యవసరంగా ఏర్పాటు చేయనున్న సింగరేణి సైట్ కార్యాలయాన్ని అతి త్వరలోనే ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. ఇందుకు కావలసిన భూమి సేకరణ, భవన వసతులు, మౌలిక సదుపాయాలు మరియు ఇతర పసిపాటి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతిని ప్రత్యక్షంగా ఆదేశించారు.

ఈ కీలకమైన క్షేత్రస్థాయి పర్యటన మరియు సమీక్షా సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, సంస్థ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ సంస్థకు చెందిన అత్యున్నత అధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ మరియు రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ తదితరులు పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించారు.

సింగరేణి సంస్థ కేవలం సాంప్రదాయ బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా, ఇతర విలువైన ఖనిజాలైన బంగారం, రాగి, ల్యాథనైడ్స్ వంటి కీలకమైన తవ్వకాల వైపు కూడా తన దృష్టిని విస్తరించడం తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక పురోగతికి ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. దేవదుర్గ బ్లాక్‌లో తగినంత బంగారం మరియు రాగి లభ్యత నిర్ధారణ అయితే, సింగరేణి సంస్థ ఆదాయం భారీగా పెరగడమే కాకుండా, రాబోయే రోజుల్లో వేలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం త్వరితగతిన చర్యలు వేగవంతం చేస్తోంది.

# తెలంగాణకు వర్ష లోటు

ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. నల్గొండలో శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వర్షపాతం లోటు ఉన్నప్పటికీ సాగు విస్తీర్ణంపై ఇప్పటివరకు పెద్దగా ప్రతికూల ప్రభావం కనిపించలేదు. రైతులు వర్షాలు తిరిగి పుంజుకుంటాయన్న ఆశతో పంటల సాగును కొనసాగిస్తున్నారు. అయితే వర్షాలు మరింత ఆలస్యమైతే వర్షాధార పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పంటలకు అవసరమైన తేమ అందుబాటులో ఉండటంతో రైతులు తదుపరి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

హనుమకొండలో అత్యధికంగా 45 శాతం, వరంగల్‌లో 43 శాతం, జనగామలో 40 శాతం వర్షపాతం లోటు నమోదైంది. హైదరాబాద్ పరిధిలోనూ సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో ఆయా జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురిస్తే ప్రస్తుతం ఉన్న లోటు కొంత మేర తగ్గే అవకాశం ఉంది.

వర్షపాతం లోటు కారణంగా కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చెరువులు, కుంటలు, చిన్న నీటి వనరుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటి అవసరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో రైతులు మరోసారి వర్షాలు కురుస్తాయనే ఆశతో ఆకాశం వైపు చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న తేమతో పంటలకు పెద్దగా ఇబ్బంది లేకపోయినా, వర్షాలు మరింత ఆలస్యమైతే పంటల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

మరోవైపు వాతావరణ శాఖ రానున్న రోజుల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు సూచిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ వర్షాలు విస్తృతంగా కురిస్తే ప్రస్తుతం ఉన్న 15 శాతం లోటు కొంత మేర తగ్గే అవకాశం ఉంది. అయితే అన్ని జిల్లాల్లో సమానంగా వర్షాలు పడకపోతే ప్రాంతాల మధ్య వర్షపాత వ్యత్యాసం మరింత పెరిగే అవకాశముంది. దీంతో రైతులు, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

# లాటరీలో ఇందిరమ్మ ఇల్లు!

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీనగర్ పాద ప్రసంగం హాల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన లాటరీ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. లాటరీ ప్రక్రియ నిష్పాక్షికంగా జరుగుతోందని నిరూపించేందుకు దరఖాస్తుదారుల నుంచి ఒక మహిళను వేదికపైకి పిలిచి, ఆమె కుమారుడిచే బాక్స్ నుంచి లాటరీ తీయించారు. ఊహించని విధంగా ఆ బాలుడు తీసిన లాటరీ చీటీలో వాళ్ల అమ్మ జరపల లక్ష్మి పేరే రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు ఇల్లు రావడంతో ఆ మహిళ ఆనందభాష్పాలు రాల్చగా, మంత్రి పొంగులేటి ఆమెను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కోర్ అర్బన్ పరిధిలో లక్ష ఇళ్ల మంజూరు:

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (కోర్-5) పరిధిలో అర్హులైన పేదల కోసం ప్రభుత్వం మొత్తం లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. దీనిలో భాగంగా మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేశామని, త్వరలోనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు వేగవంతంగా ప్రారంభమవుతాయని చెప్పారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థల సేకరణ పూర్తయిందని, దరఖాస్తుల స్వీకరణతో పాటు టెండర్ల ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

?ఈ ఇళ్లను అత్యాధునిక సదుపాయాలతో, సెల్లార్‌తో కూడిన 17 నుంచి 20 అంతస్తుల బహుళ అంతస్తుల గృహ సముదాయాలుగా నిర్మిస్తున్నామని తెలిపారు.

# దేవాలయంలో అడుగు పెట్టగానే మనసు ఎందుకు మారుతుంది?

## ఆధ్యాత్మికతలో దాగిన ఆ అనుభూతి

రోజువారీ జీవితంలో ఎన్నో ఆలోచనలతో సతమతమవుతున్న మనిషి దేవాలయంలోకి అడుగు పెట్టగానే కొంత ప్రశాంతంగా మారతాడు. బయట ఎంత హడావుడి ఉన్నా.. ఆలయ ప్రాంగణంలోకి వచ్చిన తర్వాత మనసు నెమ్మదిస్తుంది. గంటానాదం వినిపిస్తుంది.. దీపం కనిపిస్తుంది.. దేవుడి దర్శనం కోసం ఎదురుచూస్తాం. ఆ కొన్ని క్షణాల్లో మనసు తెలియకుండానే భక్తితో నిండిపోతుంది. అసలు ఆలయానికి ఉన్న ఆ శక్తి ఏమిటి?

దేవాలయం కేవలం రాతితో నిర్మించిన ఒక భవనం కాదు. తరతరాలుగా భక్తితో, విశ్వాసంతో, ప్రార్థనలతో పవిత్రతను పొందిన స్థలం. అక్కడికి వచ్చే ప్రతి భక్తుడు తన మనసులో ఒక భావాన్ని తీసుకొస్తాడు. ఎవరో కృతజ్ఞతతో వస్తారు.. ఎవరో కోరికతో వస్తారు.. మరెవరో బాధతో వస్తారు. కానీ దేవుడి ముందు నిలబడిన ఆ క్షణంలో అందరి మనసులో ఒకటే భావన ఉంటుంది.. "నాకు నీవే దిక్కు."

మనిషి తన సమస్యను అందరికీ చెప్పలేకపోవచ్చు. తన బాధను కుటుంబ సభ్యులతో కూడా పంచుకోలేకపోవచ్చు. కానీ దేవుడి ముందు మాత్రం తన మనసును పూర్తిగా విప్పుతాడు. అందుకే ఆలయం చాలామందికి ఒక ఆధ్యాత్మిక ఆశ్రయం. అక్కడ సమస్యకు వెంటనే పరిష్కారం దొరకకపోయినా.. సమస్యను ఎదుర్కొనే ధైర్యం మాత్రం కలుగుతుంది.

ఆలయంలో వెలిగే దీపాన్ని చూస్తే మనలో ఒక నమ్మకం కలుగుతుంది. చీకటి ఎంత ఉన్నా వెలుగు దాన్ని తొలగించగలదనే సందేశం అందులో ఉంటుంది. అలాగే మన జీవితంలో ఎన్ని కష్టాలు ఉన్నా.. ఒకరోజు పరిస్థితులు మారుతాయనే ఆశను భక్తి కలిగిస్తుంది. అదే విశ్వాసం మనిషిని ముందుకు నడిపిస్తుంది.

మన పూర్వీకులు దేవాలయాలను కేవలం ప్రార్థన కోసం మాత్రమే నిర్మించలేదు. అక్కడ పండుగలు జరిగేవి, ఉత్సవాలు జరిగేవి, భజనలు, పారాయణాలు జరిగేవి. ప్రజలు ఒకరినొకరు కలుసుకునేవారు. చిన్నవారు పెద్దల నుంచి సంప్రదాయాలను నేర్చుకునేవారు. అందుకే దేవాలయం ఒక ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు సామాజిక, సాంస్కృతిక కేంద్రంగానూ నిలిచింది.

ఈ రోజుల్లో జీవితం ఎంత వేగంగా మారినా.. దేవాలయానికి వెళ్లే అలవాటు మాత్రం ఇంకా కొనసాగుతోంది. కారణం ఒక్కటే.. మనిషికి ఎప్పటికీ భక్తి అవసరం. సాంకేతికత ఎంత పెరిగినా, సంపద ఎంత పెరిగినా, సౌకర్యాలు ఎన్ని వచ్చినా.. మనసుకు నమ్మకం, ధైర్యం, ప్రశాంతత అవసరం అలాగే ఉంటుంది. ఆ అవసరాన్ని ఆధ్యాత్మికత తీర్చగలదు.

అందుకే దేవుడి దర్శనం అంటే కేవలం కొన్ని నిమిషాలు విగ్రహాన్ని చూడటం కాదు. మన జీవితాన్ని కొంతసేపు ఆపి చూసుకోవడం కూడా. మనం ఎటు వెళు_న్నాం? ఏం సాధిస్తున్నాం? మన కుటుంబానికి ఎంత సమయం ఇస్తున్నాం? మన ప్రవర్తనలో ఏమైనా మార్చుకోవాల్సి ఉందా? అనే ప్రశ్నలు మనలో కలిగితే.. ఆ దర్శనం మరింత అర్థవంతమవుతుంది. దేవాలయంలో అడుగు పెట్టినప్పుడు మనం దేవుడిని చూడటానికి వెళ్తాం.. కానీ బయటకు వచ్చేటప్పుడు మనల్ని మనం కొంచెం కొత్తగా చూసుకుని రావాలి. ఎందుకంటే దేవుడి సన్నిధి మన కోరికలను మాత్రమే వినే స్థలం కాదు.. మనలోని నమ్మకాన్ని మేల్కొలిపే పవిత్ర స్థలం.



– సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# ఖానాపూర్‌లో బ్యాంకర్ల సంయుక్త మండల స్థాయి సమీక్షా సమావేశం



.ఖానాపూర్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఖానాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మొదటి త్రైమాసికానికి సంబంధించి ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రైతు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల పునరుద్ధరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, పీఎంఈజీపీ, ముద్రా రుణాల అమలు తీరును సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే ఉపకార వేతనాలు సకాలంలో ఖాతాల్లో జమ అయ్యేలా రెండు వేల కొత్త బ్యాంక్ ఖాతాలను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను, బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# గండి రామన్న అర్బన్ పార్కులో ఘనంగా వృక్ష రక్షాబంధన్



సారంగాపూర్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రకృతి మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో సారంగాపూర్ మండల ం చించోలి సమీపంలోని గండి రామన్న అర్బన్ పార్కులో వృక్ష రక్షాబంధన్ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. కదంబ వృక్షాలు, సహజ సిద్ధ తీగలతో తయారు చేసిన పర్యావర ణహిత రాఖీలను పార్కులోని చెట్లకు కట్టి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. చెట్లను సోదర బంధంగా భావించి పర్యావరణాన్ని కాపాడాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నజీర్ ఖాన్ సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి మిత్ర సభ్యులు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ మధు, రమణారెడ్డి, సిద్ధూ, స్వదేశ్ పరికి పండ్ల, అశోక్ కుమార్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# సారంగాపూర్ వారసంతలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన



సారంగాపూర్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల కేంద్రంలోని వారసంతలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై గ్రామ సర్పంచ్ కోనేరు భూమన్న ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వ్యాపారులు వాడకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రజలు ప్రత్యామ్నాయ సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అజిత్ ఖాన్, కార్యదర్శి చైతన్య, మహేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ‘భూభారతి’ ముసుగులో భూ బకాసురుల దందా:

## మామడ తహసీల్దార్ కార్యాలయంలో నకిలీ పత్రాలతో పేదల భూమి కాజేసే యత్నం!



నిర్మల్ (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘భూభారతి’ వ్యవస్థ కొందరు అవినీతి అధికారులు, దళారుల చేతుల్లో అక్రమాలకు అడ్డాగా మారుతోంది. నిర్మల్ జిల్లా మామడ మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం హద్దులు దాటిందని, లక్షలాది రూపాయల ముడుపులు తీసుకుంటూ పేదల భూములను అక్రమంగా ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదాబైనామాలు, ఆధార్ సీడింగ్, ప్రొహిబిటెడ్ ల్యాండ్స్ తదితర కీలక రికార్డులను సైతం మార్చేస్తూ అక్రమార్కులు సాగిస్తున్న దందా తాండ్ర గ్రామ శివారులో తాజాగా బట్టబయలైంది.

తాండ్ర శివారులోని సర్వే నంబర్ 113/2 లో గల 3 ఎకరాల లావుని పట్టా అసైన్డ్ భూమి అసలు యజమాని కుడుకల పోశెట్టి. ఆయనకు ఆరుగురు సంతానం ఉండగా, ఆ విలువైన భూమిపై కన్నేసిన కొందరు రాజకీయ నాయకులు, అధికారులు కలిసి పథకం ప్రకారం దాన్ని కాజేసేందుకు తెగబడ్డారు. పోశెట్టి 2000 సంవత్సరంలోనే మరణించినట్లు సృష్టించిన నకిలీ డెత్ సర్టిఫికెట్ ఆధారంగా పెద్ద కుట్రకే తెరలేపారు. ఆ కాలంలో తహసీల్దార్లే రిజిస్ట్రార్లుగా ఉండగా, పంచాయతీ కార్యదర్శి సంతకంతో అక్రమ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

అంతటితో ఆగకుండా, బీసీ తెనుగు సామాజిక వర్గానికి చెందిన పోశెట్టికి, బీసీ గౌడ్ కులానికి చెందిన కైరి సుజాత అనే మహిళను ఏకైక కుమార్తెగా చూపుతూ తహసీల్దార్ కార్యాలయం ద్వారా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా ఇప్పించారు. కులాలు వేరైనా ఏమాత్రం పట్టించుకోకుండా అధికారులు సర్టిఫికెట్ జారీ చేయడం వెనుక భారీగా లంచాలు చేతులు మారాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అనంతరం ఆ భూమిని నకిలీ పత్రాల ద్వారా విరాసత్ దరఖాస్తుతో ఆమె పేరిట బదలాయించే ప్రయత్నం చేశారు.

అయితే, ఆధార్ ఈ-కేవైసీ పెండింగ్ కారణంగా విచారణకు వెళ్లిన జీపీఓ క్షేత్రస్థాయిలో అసలు బండారాన్ని బయటపెట్టారు. దరఖాస్తుదారు సమాధానాలు అనుమానాస్పదంగా ఉండటంతో గ్రామంలో విచారించగా, అసలైన వారసులు వేరే ఉన్నారని, సుజాతకు పట్టాదారుడితో ఎలాంటి రక్తసంబంధం లేదని నిర్ధారణ అయింది. ఉన్నత స్థాయి ఒత్తిళ్లు వచ్చినా జీపీఓ తప్పుడు నివేదిక ఇచ్చేందుకు నిరాకరించి దరఖాస్తును తిరస్కరించడంతో ఈ భారీ భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఒక జిల్లా స్థాయి నాయకుడి అండతోనే మామడ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల రాజ్యం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు, అమాయకుల భూములను కాజేస్తున్న తహసీల్దార్, సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాఖీ వేళ తనిఖీలు.. చర్యలేవీ?



నిర్మల్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాఖీ పండగను పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలో మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు స్వీట్ షాపులు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి ప్రధాన స్వీట్ షాపుల్లో విక్రయిస్తున్న తినుబండారాలు, స్వీట్ల నాణ్యతను పరిశీలించారు. స్వీట్లు ఎక్కడ తయారవుతున్నాయనే వివరాలను సేకరించి తయారీ కేంద్రాలను సైతం పరిశీలించిన అధికారులు, నోటీసులు జారీ చేయడంతో పాటు పలు ఆహార నమూనాలను సేకరించారు.

ప్రముఖ నారాయణ స్వీట్ హోమ్‌తో పాటు పలు హోటళ్లలో తనిఖీలు చేపట్టారు.

అయితే అధికారులు తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించినప్పటికీ.. అనంతరం తీసుకున్న చర్యలపై స్పష్టత లేకపోవడంపై పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పండగల సమయంలో అధికారులు తనిఖీలు నిర్వహించడం, నమూనాలు సేకరించడం, నోటీసులు ఇవ్వడం సాధారణంగా మారిందని, కల్తీ లేదా నాణ్యత లోపాలు బయటపడితే సంబంధిత వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. పండగల సమయంలో స్వీట్లు, తినుబండారాల విక్రయాలు భారీగా పెరుగుతాయి. ఈ నేపథ్యంలో స్వీట్ల తయారీలో ఉపయోగించే పాలు, నెయ్యి, నూనెలు, రంగులు, ఇతర ముడి పదార్థాల నాణ్యతను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నాణ్యత లేని పదార్థాలతో తయారు చేసిన స్వీట్లు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో తనిఖీలను కేవలం పండగలకే పరిమితం చేయకుండా నిరంతరం కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికే సేకరించిన ఫుడ్ శాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపించారా? వాటి ఫలితాలు ఏమిటి? నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎంతమందికి జరిమానాలు విధించారు? అనే వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది. తనిఖీల అనంతరం చర్యలు లేకపోతే అధికారులు నిర్వహించే తనిఖీల ఉద్దేశమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కల్తీ, నాణ్యత లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత షాపులు, తయారీ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని విక్రయాలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు. సేకరించిన నమూనాల పరీక్షా ఫలితాలు, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించడం ద్వారా అధికారులు పారదర్శకతను పాటించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# పెండింగ్ భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

## తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్




నిర్మల్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యల దరఖాస్తులను ప్రాధాన్యత ప్రాతిపదికన అత్యంత వేగంగా పరిష్కరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లాలోని తహసీల్దార్లతో పెండింగ్ భూసమస్యల దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఉన్న పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన వినతులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సరైన ఆధారాలు లేని దరఖాస్తులను తిరస్కరించే సమయంలో అందుకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.



భూసమస్యల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేసి వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి చట్టబద్ధమైన పరిష్కారం చూపి భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

# ఘనంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జన్మదిన వేడుకలు

## మెగా రక్తదాన శిబిరం.. ఆశ్రమ పాఠశాల బాలికలతో కలిసి భోజనం



భైంసా, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జన్మదిన వేడుకలను నియోజకవర్గవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యంత ఘనంగా నిర్వహించారు. భైంసా పట్టణంలోని ఆయన నివాసమైన ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ ప్రాంగణం ఉదయం నుంచే జనసంద్రంగా మారింది. బాసర ఆలయ ఈవోతో పాటు ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.
ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో 40 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అభిమానులు ఎమ్మెల్యేకు లడ్డులతో తులాభారం వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో బాలికలతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. విద్యార్థినులు కేక్ కట్ చేసి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.
ఆశ్రమ పాఠశాల సమగ్ర అభివృద్ధికి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే ప్రకటించారు. పురుషోత్తమ్ మహారాజ్ కీర్తన ప్రవచనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలువురు నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి, కంటి ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో జాతీయ క్రీడా దినోత్సవం

## క్రీడాకారులకు పతకాలు అందజేసిన జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి



భైంసా, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు):హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భైంసాలోని ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కోచ్ సాయికృష్ణ సమన్వయంతో జరిగిన ఈ వినోదాత్మక పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.
పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ రజిత పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. యువత నిత్యం వ్యాయామం, యోగా, క్రీడలను తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఆరోగ్యమే మహాభాగ్యం – క్రీడలే ఆరోగ్యానికి పునాది అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ముగ్ధం విక్రమ్, ప్రకాష్ పాటిల్, ఉప్పు రవీందర్, సాయినాథ్, కోచ్‌లు, క్రీడాభిమానులు, క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కౌట్ల-బి గ్రామంలో ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమం

.సారంగాపూర్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ ఖండం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కౌట్ల-బి గ్రామంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఖండ శారీరక ప్రముఖ్ ముద్రం శివ మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సమాజంలో సోదరభావం, ఐక్యత, సామాజిక బాధ్యతను పెంపొందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి దేశ, సమాజ సేవకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈ. శ్రీకాంత్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు టి. మైత్రేష్, బి. సాయినాథ్, బి. సాయికిరణ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.



# నిర్మల్‌లో మహారాణా ప్రతాప్ విగ్రహావిష్కరణ వార్షికోత్సవం



నిర్మల్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్‌పై ఉన్న వీర యోధుడు మహారాణా ప్రతాప్ విగ్రహావిష్కరణ వార్షికోత్సవాన్ని రాజ్‌పుత్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కిషన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. దేశ రక్షణ కోసం అలుపెరగని పోరాటం చేసిన మహారాణా ప్రతాప్ చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ సింగ్, సభ్యులు సాయి సింగ్, నారాయణ సింగ్, విశాల్ సింగ్, ఆనంద్ సింగ్, భరత్ సింగ్, రోహిత్ సింగ్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఆత్యపాత్య పోటీలు

నిర్మల్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి ఆత్యపాత్య క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి సుమారు వందలాది మంది క్రీడాకారులు పాల్గొంటున్నందున మైదానాలను సిద్ధం చేశారు. పోటీలను విజయవంతం చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వన్నెల భూమన్న, కార్యదర్శి సంజీవ్ కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సాయి, సురేష్, ముఖేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# గాజుల్‌పేట్ కాశీ విశ్వనాథ ఆలయంలో ఘనంగా మహారుద్రాభిషేకం

నిర్మల్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్మల్ పట్టణంలోని గాజుల్‌పేట్ కాశీ విశ్వనాథ ఆలయంలో 15వ రోజు మహారుద్రాభిషేకం మరియు పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ లింగన్న, పూర్వ చైర్మన్ ఆమెడ శ్రీధర్, పూర్ణేందర్, దార్ల రాజేశ్వర్, అయ్యన్నగారి శ్రీనివాస్, పడిగెల శివ, రవి, లక్ష్మణ్, పోశెట్టి, వార్డు మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



# ముధోల్, లక్ష్మణచాంద, బాసరలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ముధోల్/బాసర/లక్ష్మణచాంద, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ముధోల్, లక్ష్మణచాంద, బాసర మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీస్సులు తీసుకున్నారు. ముధోల్ మండలం ఆష్టా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, ఉపసర్పంచ్ సావిత్రి సురేఖ రాఖీలు కట్టి స్వీట్లు అందజేశారు. ముధోల్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలోనూ రక్షాబంధన్ వేడుకలు కన్నులపండువగా జరిగాయి.



# ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు



భైంసా, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నివాసానికి వెళ్లి వడ్తల గ్రామ సర్పంచ్ రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వడ్తల గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే ముధోల్ బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, తాటేవర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, కంటి దవాఖానాల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గడ్డం సుభాష్, సప్పటోళ్ల పోతన్న, గంగప్రసాద్, విష్ణు, శ్రీకాంత్, జీవన్,

# సీసీ రోడ్డు పక్కన మొరం లేక వాహనదారుల ఇబ్బందులు



ముధోల్, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలోని సాయి మాధవ్ నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేయకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. శుక్రవారం రోడ్డు పక్కన మొరం లేక ఓ కారు అదుపుతప్పి పక్కకు దిగబడటంతో స్థానికులు ఆందోళన చెందారు. రాత్రి వేళల్లో రోడ్డు అంచులు కనిపించక ప్రమాదాలు జరిగే ముప్పు ఉందని, అధికారులు వెంటనే స్పందించి మొరం వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

# సరస్వతి ఆలయ బాలాలయంలో విద్యార్థుల నామస్మరణ

బాసర, ఆగస్టు 28 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి బాలాలయంలో స్థానిక శ్రీ నాగభూషణ విద్యాలయ విద్యార్థిని విద్యార్థులు శ్రీమాత్రే నమః అంటూ అమ్మవారి నామస్మరణ చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వచ్చిన విద్యార్థులతో అర్చకుడు మురళీ శ్రోత్రి ప్రత్యేక శ్లోకాలు, నామస్మరణ చేయించడంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో మార్మోగింది.



# అంగం రంగ వైభవంగా రక్షా బంధన్...



ముధోల్, ఆగస్టు 28(తెలంగాణ వెన్నెల వాక్కు ):మండల కేంద్రమైన ముధోల్ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా “రక్షా బంధన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాసర ఖండ కార్యవాహ రాంపూర్ ముత్యం వక్త గా విచ్చేసి రక్షాబంధన్ విశిష్టతను అన్న చెల్లి, అక్క తమ్ముడు, తల్లి కొడుకు, భార్య భర్త మధ్య గల సంబంధాన్ని చేయవలసిన కర్తవ్యాన్ని తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు రక్షాబంధన్ చేసుకుంటూ తేనె బద్ధో బలిరాజా! అనే శ్లోకంతో పాటు “ నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనమందరం కలిసి ఈ దేశానికి రక్షా అంటూ రక్షా బంధనం చేసుకున్నారు. అనంతరం ముధోల్ ప్రధాన వీధుల్లోను ప్రభుత్వ ప్రభుత్వేతర కార్యాలయాల్లో చుట్టూ ప్రక్కల గ్రామాలలో రక్షాబంధనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్,పాఠశాల అధ్యక్షులు కొండావార్ సంజీవ్,సభ్యులు బొంతుల దత్తు, దత్తాత్రి, ప్రధానాచార్యులు సారథీ రాజు,ఆచార్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com